# ఘనంగా ఇస్కాన్ ముగింపు ఉత్సవాలు



ఇస్కాన్ మందిరం వ్యవస్థాపకుడు శ్రీల ప్రభుపాదుల విగ్రహం



విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం,సెప్టెంబర్3(ఆన్‌లైన్/కల్చరల్): కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ మహోత్సవాలతో ముగింపు వేడుకలు ఘనంగా ముగిశాయి. మహామంగళ దర్శన హారతితో ప్రారంభమైన ఉత్సవాలలో గురుపూజ, కృష్ణలీలామృత ప్రవచనం అద్భుతంగా జరిగింది. సమాజాన్ని వైదిక మత ధర్మం వైపు మళ్ళించిన ఘనత ప్రభుపాదులదేనని శ్లాఘించారు. భక్తి వేదాంతులైన ప్రభుపాదులు ఇస్కాన్ స్థాపనతో ప్రపంచ ఆధ్యాత్మిక రంగంలో విశేష మార్పులు సంభవించాయని పలువురు అభిప్రాయపడ్డారు. మధ్యాహ్నం పూజ్య గురువుల మహోన్నత పవిత్ర విగ్రహానికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగంలో భారీ అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. సాయంత్రం జరిగిన భజన కార్యక్రమం అందరినీ అలరించింది. అన్నమాచార్య, పురందరదాసు సంకీర్తనలను మధురంగా ఆలపించారు. సహకరించిన భక్తులు, అధికారులు, ప్రముఖులకు ఇస్కాన్ మందిర ఆలయ మేనేజర్ దామోదర ఔరంగదాసు ప్రభు కృతజ్ఞతలను తెలిపారు.



తెలుగుదేశం జిల్లా కన్వీనర్ పార్థసారథి జన్మదినం సందర్భంగా కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు శ్రీధర్‌చౌదరి, నదీం, బీవీ వెంకటరాముడు, లక్ష్మీపతి తదితరులు



అనంతపురం ఎమ్మెల్యే గురునాథరెడ్డి తల్లి మృతదేహం వద్ద సంతాపం ప్రకటిస్తున్న ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి

# కన్నులపండగగా శ్రీనివాస కల్యాణం



లలితకళాపరిషత్‌లో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం నాటకంలోని దృశ్యాలు

అనంతపురం,సెప్టెంబర్3(ఆన్‌లైన్/కల్చరల్): సురభి కళాకారుల వేదిక శ్రీవినాయక నాట్య మండలి వారిచే శుక్రవారం సాయంత్రం స్థానిక లలిత కళాపరిషత్‌లో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహకారంతో జరిగిన శ్రీనివాస కల్యాణం నాటిక ప్రేక్షకులను తన్మయత్వానికి గురిచేసింది. మేఘాల నుంచి నారదుడు దిగి వచ్చే దృశ్యం, ఆవు పుట్టలోనికి పాలు పోస్తుంటే శ్రీనివాసుడు తాగే సన్నివేశం, పద్మం నుంచి పద్మావతి జనించే దృశ్యం నమ్మలేని విధంగా చూపించి సురభి కళాకారులు అందరి మనసులను ఆనందడోలికల్లో ముంచెత్తారు. వేణుగోపాల్, దినకర్ పోటీపడి నటించి మెప్పించారు. కుమారబాబు, పద్మావతిగా నటించిన శాంతి, వకుళదేవిగా నటించిన సువర్ణదేవి అద్భుత నటనతో అందరి మనసులు దోచుకున్నారు. చివరి సన్నివేశంలో భూగోళం కింద మంటలు రావడం, శ్రీనివాసుడు శిలగా మారిపోవడం లాంటి దృశ్యాలు అనితర సాధ్యం అని పలువురు అభినందించారు. కలెక్టర్ సందేశంతో ప్రారంభమైన కార్యక్రమంలో లలితకళాపరిషత్ కార్యదర్శి జీ నారాయణస్వామిని, టీటీడీ మేనేజర్ వేణును ఘనంగా సన్మానించారు. రాము,అబ్దుల్ సత్తార్, వరప్రసాద్, పాండురంగమూర్తి నాటకాన్ని తిలకించారు.





## ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు
# భారతావని

పుట్టపర్తి, సెప్టెంబర్3(ఆన్‌లైన్): భక్తిభావానికి, ప్రేమతత్వానికి, ఆధ్యాత్మికతకు, సనాతన ధర్మాలకు భారతావని పుట్టినిళ్ళు అని సత్యసాయి విద్యార్థులు నాటిక ద్వారా తెలిపారు. శుక్రవారం రాత్రి సాయికుల్వంత్‌లో ఆల్‌ఇండియా సత్యసాయి పాఠశాలల విద్యార్థులు సంగీత నాటక నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస సనాతన ధర్మాలకు భారతావణి పుట్టినిళ్ళు అని, భారతీయ సాంప్రదాయం ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలుస్తుందనే సత్యాన్ని నాటిక ద్వారా తెలిపారు. సత్యసాయి అందిస్తున్న ఆధ్యాత్మిక, ఉచిత విద్య, వైద్య సేవలను గురించి నాటికలో తెలిపారు. అనంతరం బాబా విద్యార్థులను ఆశీర్వదించారు.

## జిల్లా వ్యాప్తంగా వర్షాలు

అనంతపురం,సెప్టెంబర్3(ఆన్‌లైన్): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం విస్తారంగా వర్షం కురిసింది. అనంతపురం, ఉరవకొండ,గుంతకల్లు, హిందూపురం తదితర ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ధర్మవరం,తాడిపత్రి,కదిరి తదితర ప్రాంతాల్లో ఓమోస్తారుగా వర్షపు కురిసింది. అనంతపురం నగరంలోని ప్రధాన కూడళ్ల వర్షపు నీటితో జలమయమయ్యాయి.

